క్లుప్తంగా

నియామకపత్రం అందజేత



డొంకేశ్వర్: బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మండలానికి చెందిన ఎనుగందుల సాగర్ నియామకం అయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని శుక్రవారం అందుకున్నారు. తనపై నమ్మకంతో జిల్లా కార్యవర్గ సభ్యుడిగా అవకాశం కల్పించినందుకు సాగర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్ ప్రైమరీ స్కూలులో అటెండర్‌గా విధులు నిర్వర్తించి అనారోగ్యంతో మృతిచెందిన బాలయ్య కుటుంబానికి పీఆర్టీయూ నాయకులు రూ. 47,100 నగదు ఆర్థికసాయాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్, నాయకులు తుమ్మల లక్ష్మణ్, ప్రవీణ్‌రెడ్డి, అంకం నరేశ్, బోడ దేవానందం, హరిచరణ్, వినయ్‌కుమార్, శైలజ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంఘ బలోపేతానికి కృషి చేయాలి



బాల్కొండ: టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం బలోపేతానికి సభ్యులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా బాధ్యుడు వడ్లాల శ్రీనివాస్ అన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకపోవడం బాధకరమన్నారు. కార్యక్రమంలో సభ్యులు జ్యోతి, రమాదేవి, రుద్ర, మధు, రవి, హన్మాండ్లు, విజయానంద్, ప్రవీణ్, రాజేందర్ పాల్గొన్నారు.

పెట్రోల్‌లో నీళ్లు..



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని ఓ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్‌తో పాటు నీళ్లు వస్తున్నాయని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన శ్రీనివాస్ గత మూడు రోజులుగా తన కొత్త బైక్‌లో మెట్‌పల్లి రోడ్‌లోని ఓ పెట్రోల్ బంక్‌లో పోయించుకుంటున్నాడు. ప్రతిరోజూ వాహనం కొద్ది దూరం వెళ్లగానే ఆగిపోతుండడంతో బైక్ మెకానిక్‌కు చూయించాడు. ట్యాంక్ శుభ్రం చేస్తుండగా నీరు ఉందని తెలుపడంతో శ్రీనివాస్ దానిని తీసుకెళ్లి పెట్రోల్ బంక్ సిబ్బందికి చూయించాడు. దీంతో సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో గొడవ జరిగింది. బంక్ యజమాని సైతం పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పాటు బుకాయించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బంక్‌కు వాహన చోదకులు రావడంతో బైక్ రిపేర్ చార్జీలు తానే భరిస్తానని యజమాని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. పెట్రోల్ బంక్‌పై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

బీఎస్పీతోనే బంగారు భవిత

నందిపేట: భావితరాల భవిష్యత్తు మారాలంటే బీఎస్పీతోనే సాధ్యమవుతుందని బహుజన సమాజ్ పార్టీ జిల్లా మహిళా ఇన్‌చార్జి అరుణజ్యోతి అన్నారు. మండల కేంద్రంలో బీసీ మహిళలు బహుజన్ సమాజ్ పార్టీలో శుక్రవారం చేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఎస్పీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరే సుధాకర్, నాగమణి, సుజాత, జయ, రూప, భాగ్య, మంజుల, లావణ్య, అల్లెం లక్ష్మి, ప్రమీల, గొల్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

రెంజల్: బేటీ బచావో.. బేటి పడావో కార్యక్రమంలో భాగంగా మండలంలోని వీరన్నగుట్ట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో చిత్ర ప్రదర్శన నిర్వహించారు. శుక్రవారం మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్రం పర్యవేక్షణలో చిత్ర ప్రదర్శణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌బీ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త స్వప్న, ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన అద్దె

- భీమ్‌గల్ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాల అద్దె వసూళ్లకు బ్రేక్
- రూ. 8 లక్షలకు పైగా పేరుకుపోయిన బకాయిలు
- నోటీసులు జారీ చేసిన అధికార యంత్రాంగం



షాపింగ్ కాంప్లెక్స్ సముదాయం

మోర్తాడ్: భీమ్‌గల్ మండల పరిషత్ కార్యాలయానికి ఆదాయం తెచ్చే దుకాణ సముదాయాల నుంచి అద్దె బకాయిలు వసూలు కావడం లేదు. దుకాణాల కిరాయి నామమాత్రంగానే ఉన్నా కొందరు రాజకీయ నాయకుల అండదండలతో దుకాణ నిర్వాహకులు చెల్లింపుల్లో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయం చుట్టూ 75 మడిగెలు ఉన్నాయి. కింద ఉన్న దుకాణాలకు ఒక రకంగా పై అంతస్తులో ఉన్న దుకాణాలకు మరో విధంగా అద్దెను నిర్ణయించారు. నెలకు రూ.2వేల లోపు అద్దె ఉన్నా ప్రతి నెలా చెల్లించడంలో కొందరు వ్యాపారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా అద్దె బకాయిలు రూ.8లక్షల వరకు పేరుకుపోయాయి. నెలల తరబడి కిరాయిలు చెల్లించకున్నా ఉద్యోగులు సైతం వ్యాపారులపై ఒత్తిడి చేయకపోవడంతో బకాయిలు పేరుకుపోయి మండల పరిషత్ ఆదాయానికి గండిపడుతోంది. అద్దె వసూలుకు ఉద్యోగుల బృందం ఇటీవల నోటీసులను జారీ చేసింది. అయినా వసూళ్లు జరగకపోవడంతో మండల పరిషత్‌కు ఆదాయం సున్నాగానే మారుతోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అద్దె వసూళ్లపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

నోటీసులు జారీ చేశాం

అద్దె చెల్లించని దుకాణాదారులకు నోటీసులు జారీ చేశాం. వారు స్పందించకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈనెలాఖరులోగా బకాయిలు పూర్తిగా వసూలు చేయాలని నిర్ణయించాం.

– సంతోష్‌కుమార్, ఎంపీడీవో, భీమ్‌గల్

క్యాన్సర్ మహమ్మారిని తరిమికొడదాం

- ఏసీపీ బస్వా రెడ్డి



మాట్లాడుతున్న ఏసీపీ బస్వా రెడ్డి

పెర్కిట్: ప్రజలు స్వచ్ఛమైన ఆహారం తీసుకుంటూ క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టాలని ఏసీపీ బస్వారెడ్డి అన్నారు. ఆలూర్ మండలం మచ్చర్లలో శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి ఏసీపీ హాజరై మాట్లాడారు. ప్రజలు క్యాన్సర్‌పై భయాందోళనకు గురి కావద్దని తేలికపాటి వ్యాధిలాగానే పరిగణించాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఎంపీపీ పస్క నర్సయ్య, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి దేవరాం, వీడీసీ చైర్మన్ రాజ్‌కుమార్, కోశాధికారి అమృత్, సర్పంచ్ గంజి నర్సయ్య, వైద్యులు అశోక్, రమేశ్, నాయకులు బట్టు కిషన్, ఆకుల గంగన్న, మచ్చర్ల రాజన్న, నరేందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి



చైర్మన్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోర్తాడ్: రాష్ట్ర విత్తనోత్పత్తి సంస్థ ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేలా కృషి చేయాలని ఏర్గట్ల కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర విత్తనోత్పత్తి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డిని విన్నవించారు. వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో ఉన్న ఆయన నివాసంలో నాయకులు శుక్రవారం కలిసి సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, నాయకులు జీవన్‌రెడ్డి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

అన్వేష్‌రెడ్డికి సన్మానం

బాల్కొండ: రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డిని డీసీసీ ఉపాధ్యక్షుడు రాజుకుమార్, ముప్కాల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. విత్తనోత్పత్తి సంస్థను అభివృద్ధి చేయాలని కోరారు. వారి వెంట రైతు నాయకుడు మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

నాసిరకం ఎరువుల పంపిణీపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న సొసైటీ డైరెక్టర్లు

పెర్కిట్(ఆర్మూర్): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘంలో నాసిరకం ఎరువుల పంపిణీలో జరిగిన అవినీతిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని డైరెక్టర్లు డిమాండ్ చేశారు. సొసైటీలో శుక్రవారం చైర్మన్ పెంట భోజారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అధిక కమీషన్ల కోసం నాసిరకం ఎరువులను పంపిణీ చేయడంతో రైతులు నష్టపోయారని డైరెక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకం అని తెలిసిన వెంటనే చైర్మన్, కార్యదర్శి ఉన్నతాధికారులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. 2022–23 ఆడిట్‌పై తమకు అనుమానాలు ఉన్నాయని అధికారులు నిష్పక్షపాతంగా తిరిగి ఆడిట్ జరిపించాలని డిమాండ్ చేశారు. చైర్మన్ పెంట భోజారెడ్డి స్పందిస్తూ మార్క్‌ఫెడ్ సంస్థ నుంచి సకాలంలో ఎరువులు రాకపోవడంతో ఆగ్రిమార్ట్ నుంచి కొనుగోలు చేసి రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారుల సూచన మేరకు ఎరువుల పంపిణీని నిలిపివేసినట్లు వెల్లడించారు. ఎరువుల పంపిణీలో తాము ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని వాటికి సంబంధించిన రశీదులను జాగ్రత్తగా ఉంచామన్నారు. అనుమానాలు ఉంటే కలెక్టర్‌తో పాటు డీసీవోకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. దోషులుగా తేలితే బాధ్యత వహిస్తామని స్పష్టం చేశారు.

పంట రుణం పెంచాలి



పెర్కిట్: ఆలూర్ మండల కేంద్రంలోని సొసైటీలో శుక్రవారం చైర్మన్ తంబూర్ శ్రీనివాస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యదర్శి మల్లేశ్ సొసైటీ ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. అనంతరం ప్రస్తుతం అందజేస్తున్న పంట రుణాన్ని రూ.రెండు లక్షల వరకు పెంచాలని సమావేశంలో తీర్మాణం చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, డైరెక్టర్లు ఇంగు గోవర్ధన్, బార్ల సంతోష్‌రెడ్డి, క్లాం సాయారెడ్డి, ఆరె రాజేశ్వర్, ప్రమోద్, గంగాధర్, క్లాం భోజారెడ్డి, వెల్మ నర్సారెడ్డి, నర్సయ్య, సిబ్బంది ముత్యం, దేవరాజు, గంగాధర్, గంగారాం, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

నవీపేట: మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ్ అభియాన్ కింద పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి సీడీపీవో స్వర్ణలత మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు ఐసీడీఎస్ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అరవింద్, ఐకేపీ ఏపీఎం భూమేశ్వర్‌గౌడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, రాధలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్‌లో..

మాక్లూర్: అంగన్‌వాడీల్లో గర్భిణులకు తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్, ఎంపీడీవో జె క్రాంతి పోషకాహారం అందజేశారు. మండల కేంద్రంతో పాటు, కల్లెడిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సకాలంలో పన్ను చెల్లించాలి



పన్ను వసూలు చేస్తున్న డీఎల్పీవో సాయిబాబా

వర్ని: జీపీ పన్నులను ప్రజలు సకాలంలో చెల్లించాలని బోధన్ డివిజన్ పంచాయతీ అధికారి సాయిబాబా కోరారు. మండలంలోని సత్యనారాయణపురం, చందూర్ మండలాల్లో డీఎల్పీవో పన్ను వసూలు పనితీరును శుక్రవారం పరిశీలించారు. ఈ నెలాఖరు వరకు వంద శాతం పన్ను వసూలు చేసేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో చందర్ నాయక్, సత్యనారాయణపురం జీపీ కార్యదర్శి సాయిలు, మహేశ్ ఉన్నారు.

బిల్లులు వసూలు చేయాలి

నవీపేట: జీపీల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే వసూలు చేయాలని డీఎల్పీవో శ్రీనివాస్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల కార్యదర్శులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీపీలలో ప్రత్యేక అధికారుల పాలనకొనసాగుతుండడంతో పారిశుద్ధ్య లోప నివారణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

- ఎంపీ ధర్మపురి అర్వింద్

నవీపేట: పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి కార్యకర్త పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఎంపీ ధర్మపురి అరివ్వింద్ సూచించారు. మండల కేంద్రంలోని రఘుపతిరెడ్డి గార్డెన్‌లో నవీపేట, రెంజల్ మండలాలకు చెందిన కార్యకర్తలతో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అన్ని గ్రామాలలో బీజేపీ పార్టీ పుంజుకుంటుదని ఆయన పేర్కొన్నారు. పీఎం నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి పనులను గ్రామాలలో వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

మాక్లూర్: మండలంలోని కొత్తపల్లిలో పశువులకు ఉచిత గాలి కుంటు నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యులు కిరణ్‌దేశ్‌పాండే, ఉమా సహేర్ శుక్రవారం తెలిపారు. పశుపెంపకం దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది వినీత, గంగాజమున, జైల్‌సింగ్, అహ్మద్‌పాషా, శ్రీనివాస్, సుధీర్, లక్ష్మి, పుష్ప, గంగాధర్ పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల పర్వం శుక్రవారం ముగిసినట్లు ఎన్నికల అధికారులు గటడి ఆనంద్, తాళ్ల శ్రీనివాస్ తెలిపారు. అధ్యక్షుడిగా తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా పొడేటి శంకర్, ప్రధాన కార్యదర్శిగా దేవరిశెట్టి అరుణ్, సంయుక్త కార్యదర్శిగా సింధుకర్ చరణ్, కోశాధికారిగా తుమ్మ సుకేష్, గ్రంథాలయ కార్యదర్శిగా సూర సురేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు తులసీదాస్ క్రాంతి, కృష్ణ పండిత్, చిల్క కిష్టయ్య, కృష్ణంరాజు, ఐనారి అశోక్, ప్రవీణ్‌కుమార్, టికె కోనేరు పాల్గొన్నారు.

ఆఫీసర్స్ క్లబ్‌పై పోలీసుల దాడి

బోధన్‌టౌన్: పట్టణంలోని రాకాసీపేట్‌లో ఉన్న ఆఫీసర్స్ క్లబ్‌లోపై టాస్క్ ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. క్లబ్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో స్థానిక పోలీసులతో కలిసి దాడి చేసినట్లు టాస్క్ ఫోర్స్ సీఐ అంజయ్య తెలిపారు. ఈ దాడిలో 22 మందిని అదుపులోకి తీసుకోగా వారి నుంచి రూ. 24,430 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టణ సీఐ వీరయ్య, సిబ్బంది ఉన్నారు.

పబ్లిక్ నోటీస్ (పత్రిక ప్రకటన)

నా క్లయింటు శ్రీ కోట్టల గంగాధర్, తండ్రి కోట్టల చిన్న అశన్న, వయస్సు 62 సం॥లు, వృత్తి : వ్యవసాయము, నివాసము : ఇంటి నం. 2-88, పడగల్ గ్రామము, వేల్పూర్ మండలం, నిజామాబాద్ జిల్లా వారి సూచనల మేరకు ధృవీకరిస్తూ జనులందరికి ఇందు మూలముగా తెలియ జేయునది ఏమనగా భూమి సర్వే నం. 185/38/అపి2 లో విస్తీర్ణము ఎ. 1-34 గుంటలు ఉన్నటువంటి భూమి, శ్రీమతి దేశ్‌పాండే శోభ, భర్త దేశ్‌పాండే విఠల్ రావు, వయస్సు 77 సం॥లు, పట్టాదారు పాసుపుస్తకము నం. టీ11240040299, ఖాతా నం. 405, తహసిల్దార్, వేల్పూర్ ఆమె సమ్మతితో ఆమె కుమారుడు అయిన శ్రీ దేశ్‌పాండే అనంత్ రావు, తండ్రి : దేశ్‌పాండే విఠల్ రావు, వయస్సు 43 సం॥లు, మరియు భూమి సర్వే నం. 185/39ఖ లో విస్తీర్ణము ఎ. 2-2000 గుంటలు, 185/38/అపి1 లో విస్తీర్ణము ఎ. 2-00 గుంటలు, మొత్తం విస్తీర్ణము : ఎ. 4-20 గుంటలు, పోచంపల్లి గ్రామము, వేల్పూర్ మండలము, నిజామాబాద్ జిల్లాలో గలది శ్రీ దేశ్‌పాండే అనంత్ రావు, తండ్రి : దేశ్‌పాండే విఠల్ రావు, వయస్సు 43 సం॥లు గారి సమ్మతితో అతని భార్య గారైన శ్రీమతి దేశ్‌పాండే స్వాతి, భర్త:అనంత్ రావు దేశ్‌పాండే, వయస్సు 40 సం॥లు పట్టాదారు పాసుపుస్తకము నం. టీ11240040436, ఖాతా నం. 406, తహసిల్దార్, వేల్పూర్ కల్గి ఉన్నటువంటి భూమిని మరియు భూమి సర్వే నం. 185/42అ లో విస్తీర్ణము ఎ. 1-16 గుంటలు, 185/43అ/1 లో విస్తీర్ణము ఎ.2-39 గుంటలు, మొత్తం విస్తీర్ణము : ఎ. 4-15 గుంటలు గలది శ్రీమతి దేశ్‌పాండే స్వాతి, భర్త:అనంత్ రావు దేశ్‌పాండే, వయస్సు 40 సం॥లు గారి సమ్మతితో ఆమె భర్త గారైన శ్రీ దేశ్‌పాండే అనంత్ రావు, తండ్రి : దేశ్‌పాండే విఠల్ రావు, వయస్సు 43 సం॥లు, పట్టాదారు పాసుపుస్తకము నం. టీ11240040376, ఖాతా నం. 197, తహసిల్దార్, వేల్పూర్ కల్గి ఉన్నటువంటి భూమి, పై అందరి నివాసము: ఇంటి నం. 1-81, పోచంపల్లి గ్రామము, వేల్పూర్ మండలము, నిజామాబాద్ జిల్లా గార్లు ముప్పై(30) సంవత్సరముల వరకు అనగా తేది : 16-03-2024 నుండి 15-03-2054 వరకు పైన తెల్పిన భూములను నా క్లయింటు శ్రీ కోట్టల గంగాధర్, తండ్రి కోట్టల చిన్న అశన్న, వయస్సు 62 సం॥లు, వృత్తి : వ్యవసాయము, నివాసము : ఇంటి నం. 2-88, పడగల్ గ్రామము, వేల్పూర్ మండలం, నిజామాబాద్ గారికి లీజునకు ఇవ్వడము జరిగినది, కావున ప్రజలందరికి తెలియపరుచునది. ఏమనగా నా క్లయింట్ లీజునకు తీసుకున్న పైన తెల్పిన భూములను ఎవరు కొనుగోలు చేయరాదని, చేసినట్లయితే నా క్లయింట్ లీజు కాలము ముగిసే వరకు ఇట్టి భూములను స్వాధీన పర్చడము జరుగదని, ఒక వేల నా క్లయింట్‌నకు లీజునకు ఇచ్చిన వ్యక్తి/వ్యక్తులు ఎవరు ఎవరికైన అమ్మివేసే ప్రయత్నము చేసిన అది చెల్లనేరదని తెలియపర్చడము జరుగుతుంది, అందు వలన సమస్త ప్రజానికానికి సవినయముగా తెలియ పర్చునది ఏమనగా పైన తెల్పిన ఆస్తులను మా యొక్క లీజు కాలము 30 సం॥ములు ముగిసే వరకు ఎవరు కొనకూడదని, ఒక వేళ ఎవరైన కొనుగోలుదారు పైన తెల్పిన ఆస్తిని కొనుగోలు చేసిన, కొనుగోలు చేసే ప్రయత్నము చేసిన కొన్నవారికి ఎలాంటి హక్కులు రావని, కొనుగోలుదారు చట్టరిత్యా చర్యకు అర్హుడు కాగలడు అని సమస్త ప్రజానికానికి తెలియజేయడము జరుగుతుంది.

సం/- ఎస్. జగన్, న్యాయవాది ఆర్మూర్
నిజామాబాద్ జిల్లా, తెలంగాణ,
సెల్ : 9666513680

నర్సరీల పరిశీలన



నర్సరీలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సాయాగౌడ్

ఎడపల్లి: మండలంలోని కుర్నాపల్లి, ఠాణాకలాన్‌లోని నర్సరీలను డీఆర్‌డీవో సాయాగౌడ్ శుక్రవారం పరిశీలించారు. అంతేకాకుండా ఠాణాకలాన్‌లో మాటుకాలువకు సంబంధించిన పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఆయన వెంట ఏపీడీ ఓంపాల్, ఎంపీడీవో గోపాలకృష్ణ, ఏపీవో శ్రీవాణి, టీఏలు జ్యోతి, జ్యోతి, సెక్రటరీలు హేమ, బండి నర్సయ్య తదితరులు ఉన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

బోధన్‌రూరల్: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని డీఆర్‌డీవో సాయాగౌడ్ అన్నారు. మండలంలోని బెల్లాల్ గ్రామంలో ఉన్న నర్సరీని శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్, ఏపీవో మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ ఇన్‌చార్జి చైర్మన్‌కు సన్మానం



బోధన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నూతన డీసీసీబీ ఇన్‌చార్జి చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డిని శుక్రవారం సాలూర, హున్సా సొసైటీల చైర్మన్లు అల్లె జనార్ధన్, మందర్న రవి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. వీరి వెంట పార్టీ మండల నాయకులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో గౌడ సంఘం సభ్యులు నిర్మిస్తున్న ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి గౌడ కుల సంఘ సభ్యులు శుక్రవారం భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి

రుద్రూర్: మండలంలోని గూండ్ల వాగు ప్రాంతంలో పేకాటస్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై అప్పారావు శుక్రవారం తెలిపారు. దాడిలో ఏడుగురు అదుపులోకి తీసుకోగా వారి నుంచి రూ.5890 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆలయ భూములు ఇప్పించాలని ఎంపీకి వినతి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

రెంజల్: మహారాష్ట్రలోని ధర్మాబాద్‌లో ఉన్న రెంజల్ మండలం నీలా రామాలయానికి చెందిన భూములను అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీ అర్వింద్‌కు నీలా గ్రామస్తులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో వివాదస్పదంగా ఉన్న హిందూ వాహిని జెండా గద్దె నిర్మాణ స్థలాన్ని శుక్రవారం సందర్శించారు. అధికారులు జెండా ఎగురవేయడానికి అనుమతులు ఇవ్వడంలేదని గ్రామస్తులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. స్థానిక ఎమ్మెల్యేతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని, అవసరమైతే తాను సీపీతో మాట్లాడుతానని గ్రామస్తులకు వివరించారు. పలు కుల సంఘాల పెద్దలు ఎంపీని కలిసి కమ్యూనిటీ భవనాలకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రాలను అందించగా ఆయన సానుకూలంగా స్పందించారు. నీలా రామాలయానికి చెందిన 75 ఎకరాలు మహారాష్ట్రలోని ధర్మాబాద్ శివారులో ఉన్నాయని అక్కడి అధికారులు అందించేందుకు నిరాకరిస్తున్నారని వైస్ ఎంపీపీ యోగేశ్ ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తనకు పూర్తి ఆధారాలు అందిస్తే మహారాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. రెంజల్ శివారులో వక్ఫ్ భూములను కొందరు దొంగ పట్టాలు సృష్టించి కబ్జా చేస్తున్నారని రెంజల్‌కు చెందిన వ్యక్తులు ఆయనకు వివరించారు. ఆయన వెంట ఎంపీపీ లోలపు రజని, జెడ్పీటీసీ విజయ, నాయకులు యోగేశ్, గోపికృష్ణ, కిశోర్, సంతోష్, శివ, శ్రీనివాస్, రాజు, పోచయ్య ఉన్నారు.

పలువురికి పరామర్శ

మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సుదర్శన్‌యాదవ్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన్ని పరామర్శించారు. నీలా క్యాంపుకు చెందిన కోయ వెంకటేశ్వర్లు తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుమారుడు వెంకటేశ్వర్‌రావును పరామర్శించారు.

సంక్షిప్తం

చలివేంద్రం ప్రారంభం

వర్ని: మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పార్టీ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. పార్టీ నియోజకవర్గ కోకన్వీనర్ భూపాల్‌రెడ్డి, నాయకులు శ్రీహరిగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వినోద్, సంతోష్, గణేశ్, లక్ష్మారెడ్డి, దశరథ్, శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

రుద్రూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అక్బర్‌నగర్‌లోని ప్రధాన రహదారిపై ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం శుక్రవారం తనిఖీలు చేపట్టింది. వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

నేడు కామ దహన కార్యక్రమం

రుద్రూర్: మండల కేంద్రంలో శనివారం రాత్రి యజ్ఞ సహిత కామ దహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవీదాస్‌రావు గోశాల, పతంజలి యోగా సేవా సమితి సభ్యులు శుక్రవారం తెలిపారు. కామ దహనంలో పర్యావరణానికి హాని కలిగించే వస్తువులు వేయవద్దని వారు కోరారు.

సామూహిక సీమంతాలు

బాల్కొండ: మెండోరా మండలం సోన్‌పేట్‌లో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణులకు శుక్రవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు పుష్ప, సరోజ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహరం తీసుకోవాలని కార్యక్రమంలో ఆశావర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

మాక్లూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అగ్నిమాపక శాఖ సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. వంట సిలెండర్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కృష్ణవేణి'లో సెమినార్

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో శుక్రవారం 'పిల్లల పెంపకం ఒక కళ' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ జీఎపీ కుమార్ హాజరై మాట్లాడారు. పిల్లల పెంపకంపై పలు అంశాలను పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాలల జోనల్ ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కోట ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా రూపొందించిన గోడప్రతులను పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్, పీవైఎల్ అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు రాహుల్, పవన్, ప్రవీణ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

కిరణ్‌కు ఘన నివాళి

బోధన్: ఐఎఫ్‌టీయూ అనుబంధం ప్రగతిశీల ఆటో, మోటార్స్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఐఎఫ్‌టీయూ, వివిధ ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం ఘన నివాళులర్పించారు. పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కిరణ్ చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేశారు. ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశ్, నాయకులు నాగమణి, పడాల శంకర్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంనాథ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776
బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ కృష్ణ : 7997958178
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899